క్లుప్తంగా

రేపు ఉపాధి హామీపై ఓపెన్ ఫోరం

దేవరకొండ(చందంపేట): చందంపేట మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి హామీపై ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాములునాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం సేకరించిన వివరాల ఆధారంగా ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది హాజరుకావాలని సూచించారు.

నర్సరీల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలి



గూడూరులో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

మిర్యాలగూడ: హరితహారం కింద చేపట్టిన నర్సరీల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని గూడూరు, కొత్తగూడెం, కిష్టాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. నర్సరీలన్నింటినీ షేడ్ నెట్‌లో ఉంచాలని, మొక్కలు ఎండిపోకుండా నీరందించాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ, ఇన్‌చార్జి ఏపీఓ కళావతి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పులిహోర, పెరుగన్నం పంపిణీ



పెరుగన్నం, పులిహోర పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు పులిహోర, పెరుగన్నం పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మిర్యాల శత్రయ్య పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ 104ఎ 8వ రీజియన్ చైర్మన్ డైమండ్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు లకుమారపు పాండురంగయ్య, సత్యనారాయణ, రేపాల శ్రీనివాస్, మిట్టపల్లి సంధ్యారాణి, శ్రీనివాస్, విద్యాసాగర్, సతీష్, వేదశ్రీ, ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల పాదయాత్రకు కాంగ్రెస్ మద్దతు



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలో కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్రకు మద్దతు ప్రకటిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సల్కునూరు గ్రామం వరకు ఆయన పాదయాత్రలో పాల్గొని మాట్లాడారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు పెరిగి గీత వృత్తినే నమ్ముకొని గ్రామాల్లో బతుకీడుస్తున్న గీత కార్మికులు నేడు బజారున పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ నాయకులు తంగెళ్ల సత్తిరెడ్డి, ఎన్ఎస్‌యూఐ నాయకుడు బొంగర్ల వినోద్, గీత కార్మిక సంఘం కార్యదర్శి చొగాని సీతారాములు, కొండా వెంకన్న, లింగస్వామి, శ్రీను పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ పునరుద్ధరణ పనులు

వేములపల్లి: మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు శుక్రవారం నుంచి చేపడుతున్నట్లు గ్రామ పెద్ద బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన గ్రామస్తులతో కలిసి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టే స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన చల్లబట్ల నాగజ్యోతి సహకారంతో ఆలయ పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బంటు జనార్దన్, పల్లా వెంకటయ్య, చిరుమర్రి నాగయ్య, కంచర్ల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని డొక్కలబావితండా–నేతాపురం రోడ్డు మరమ్మతులకు గురయ్యింది. మిర్యాలగూడ పట్టణంతో పాటు నిడమనూరు మండలంలో ప్రసిద్ధిగాంచిన కోటమైసమ్మ ఆలయం, దామరచర్ల మండలంలోని బంగారు మైసమ్మ దేవాలయానికి ఈ దారి గుండానే వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డు దెబ్బతినడంతో ఈ దారి గుండా ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు జంకుతున్నారు. రాత్రివేళ ఈ దారిగుండా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి.

యల్లాపురంతండా–పిల్లిగుండ్లతండా రోడ్డు..

మండలంలోని యల్లాపురంతండా నుంచి పిల్లిగుండ్ల తండాకు వెళ్లే రహదారి కూడా పూర్తిగా దెబ్బతిని కంకరతేలి ఉంది. చింతలపాలెం, గోడుమడక, నెల్లికల్లు, ఎర్రచెరువుతండా, జాల్‌తండా, బట్టు వెంకన్నబావి తండా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఈ దారి గుండానే రావాలి. నాగార్జునసాగర్‌కు వెళ్లేవారు కూడా ఈ దారిగుండానే వెళ్తారు. రోడ్డు పూర్తిగా కంకరతేలి నెలలు గడుస్తున్నా నేటికి ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కంకరతేలి గుంతలమయంగా మారిన పిల్లిగుండ్లతండా రోడ్డు

మరమ్మతులు చేపట్టాలి



డొక్కలబావితండా, నేతాపురం రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. వర్షాలు వచ్చినప్పుడు గుంతల్లో నీరు చేరి గుంతలు కనపడకుండా ఉన్నాయి. దీంతో ఈ రోడ్డు పై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– కృష్ణానాయక్, డొక్కలబావితండా

ప్రమాదాలకు గురవుతున్నాం



యల్లాపురంతండా, పిల్లిగుండ్లతండా రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకోవడంలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– జటావత్ రాజునాయక్, పిల్లిగుండ్లతండా

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

డిండి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ పిలుపునిచ్చారు. బుధవారం డిండి మండల పరిధిలోని ఉమ్మడి ఖానాపూర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే హామీలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రతిఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీను, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు లక్పతినాయక్, దామోదర్‌రెడ్డి, నాగేశ్వరావు, జర్పుల లక్ష్మీతిరుపతి, సిరాజ్ ఖాన్, హరికృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.



కూరగాయలు విక్రయిస్తున్న మహిళతో మాట్లాడుతున్న బాలూనాయక్

'ఆయుష్మాన్ భారత్'ను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు సాధినేని శ్రీనివాస్‌రావు, స్థానిక కౌన్సిలర్ చిలుకూరి రమాదేవి అన్నారు. బుధవారం పట్టణంలోని హనుమాన్‌పేటలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన కల్పించారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో తెల్ల రేషన్‌కార్డులు ఉన్న ప్రతిఒక్కరినీ ఈ పథకంలో భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం సుమారు 1886 జబ్బులకు వర్తిస్తుందని, ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల వరకు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతిఒక్కరూ ఆన్‌లైన్‌లో ఆయుష్మాన్ భారత్ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యాం, వార్డు సభ్యులు గోపి, రత్నకుమారీ, సతీష్, శంకర్ తదితరులున్నారు.



హనుమాన్‌పేటలో ఆయుష్మాన్ భారత్ పథకం గురించి వివరిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా గోవింద్

త్రిపురారం: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని హర్జతండాకు చెందిన ధనావత్ గోవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింగ్ యాదగిరి చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో కటకం మల్లికార్జున్, జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, మేదరి సైదులు, కేతావత్ రమేష్‌నాయక్, వీరమల్ల రాంబాబు, ధనావత్ లచ్చునాయక్ తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్యయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



వేములపల్లిలో జనచైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

వేములపల్లి: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 29 వరకు చేపట్టనున్న జన చైతన్యయాత్రను జయప్రదం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు పాదూరి శశిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జన చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వరంగల్ జిల్లాలో ప్రారంభమయ్యే ఈ జన చైతన్యయాత్ర ఈ నెల 25, 26, 27 తేదీల్లో కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, మిర్యాలగూడ ప్రాంతాల్లో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోవర్ధని, నాయకులు మంగారెడ్డి, మాలోతు వినోద్, సైదులు, రమేష్, పతాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం జయంతి వేడుకలు



దేవరకొండలో కేక్ కట్ చేస్తున్న బీఎస్పీ నాయకులు

దేవరకొండ: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) వ్యవస్థాపకుడు దివంగత కాన్షీరాం 89వ జయంతి వేడుకలను బుధవారం దేవరకొండలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్ర కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు రమావత్ రమేశ్‌నాయక్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు చేసి, బహుజన రాజ్యాధికారం సాధించిన ఘనత కాన్షీరాంకే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో రాబోయేది బహుజన రాజ్యాధికారమేనని పేర్కొన్నారు. అంతకుముందు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా. ఏకుల రాజారావు, మల్లికార్జున్, లలిత, సహాని, శ్రీకాంత్, ఇమ్రాన్, మంగూనాయక్, యాదయ్య, శ్రీకుమార్, శేఖర్ తదితరులున్నారు.

మహిళలకు సన్మానం



మహిళలను సన్మానించిన దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీటీ తదితరులు

దేవరకొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యాలయంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీటీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాళ్ల శ్రీధర్ గౌడ్, కృష్ణకిశోర్, రాపోలు నిరంజన్, వైఎస్. కరుణాకర్, తాళ్ల సురేష్, రమేశ్, శ్రీను, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను ఉపయోగించుకోవాలి

మిర్యాలగూడ అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డులో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం కౌన్సిలర్ కొమ్ము శ్రీను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, కంటి వెలుగు వైద్యాధికారి శిరీష, ఆరోగ్య సిబ్బంది శ్రీధర్, రాంబాబు, మాధవి, విజయలక్ష్మి, రోజా, ఆశ వర్కర్లు తదితరులున్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ గాజుల మురళితో కలిసి మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, వడ్త్య దేవేందర్, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

తిరుమలగిరిలో...

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని సుంకిశాలతండాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం సర్పంచ్ కేశావత్ జ్యోతీరామకృష్ణనాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేశ్వర్లు, సుదర్శన్, ఝాన్సీ, సైదులు, సరోజ, రామలింగమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



దేవరకొండ: వృద్ధురాలికి కళ్లజోడు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ

అడవిదేవులపల్లిలో..


అడవిదేవులపల్లి: మండలంలోని జిలకరకుంటతండాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, డీసీసీబీ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కూరాకుల మంగమ్మ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనునాయక్, డాక్టర్ ఉపేందర్, సర్పంచ్ కుర్ర పకీరానాయక్, ఉప సర్పంచ్ కుర్ర హుస్సేన్ నాయక్, అశోక్, నాగులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని మేగ్యతండా గ్రామపంచాయతీ పరిధిలోని భోజ్యతండాలో ఎమ్మెల్యే సీడీఎఫ్ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ కేతావత్ సాజీ భిక్షానాయక్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే మిషన్ భగీరథ నీరు తండాకు వచ్చే అవకాశం లేకపోవడంతో తండాలో ఎమ్మెల్యే నిధులతో తాగునీటి ట్యాంకు, బోరు, పైపులైన్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుజ్జి, గ్రామస్తులు ఇస్త్రియ, కిరణ్, శ్రీహరి, శ్రీరాం, పూల్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జానారెడ్డి పరామర్శ

హాలియా: అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పోషం వెంకట్‌రెడ్డి ఇటీవల కిడ్నీ శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి బుధవారం కొత్తపల్లిలో పోషం వెంకట్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. జానారెడ్డి వెంట మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, సీనియర్ నాయకుడు రమావత్ శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.



పోషం వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల పరిధిలోని గోడుమడ గ్రామంలో బుధవారం పాడి పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి కేశవ్ అజ్మీరా మాట్లాడుతూ.. గ్రామంలోని 70 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగార్జునసాగర్ పశు వైద్యాధికారి డాక్టర్ నాగార్జున్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మల్లికార్జున్, హాలియా మార్కెట్ కమిటీ డైరెక్టర్ హరికృష్ణ, శంకర్‌నాయక్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.



గోదుమడకలో పశువుల గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని ప్రారంభిస్తున్న పశువైద్యాధికారి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి: గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాయినిగూడెం, కిష్టరాయినిపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణలో జరిగిందన్నారు. అనంతరం గడియగౌరారం, గొల్లపల్లి, గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కృష్ణకుమారి, జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచులు ఉజ్జిని లక్ష్మి విద్యాసాగర్‌రావు, దార్ల విశ్వనాథం, శ్రీశైలంగౌడ్, నరేందర్‌రావు, నర్సింహారావు, అక్రంయాదవ్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టరాయినిపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పేదల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. జీఓ నంబర్ 58 ద్వారా అర్హులైన పట్టణానికి చెందిన 49మందికి బుధవారం ఆయన మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా దళితబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, రైతుబీమా, రైతుబంధు, 24గంటల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత కేవలం సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి, కౌన్సిలర్లు బాసాని అలివేలుగిరి, బంటు రమేష్, సాధినేని స్రవంతిశ్రీనివాస్, కర్నె ఇందిరాగోవింద్‌రెడ్డి, కుర్ర చైతన్య, అమృతం దుర్గాసత్యం, మాజీద్, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, గొంగిడి సైదిరెడ్డి, సందేషి అంజన్‌రాజు, దైదా సోమసుందర్, ఘంటా శ్రవణ్‌రెడ్డి, కందగట్ల అశోక్, ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ అనిల్, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, తేలుకుంట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

బీఎస్పీ బలోపేతానికి కృషిచేయాలి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పూదరి సైదులు

హాలియా: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పూదరి సైదులు అన్నారు. బుధవారం హాలియా పట్టణంలో నిర్వహించిన బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 89వ జయంతి వేడుకల్లో ఆయనతో పాటు పార్టీ రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ నర్ర నిర్మల పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనుముల మండలంలోని హజారిగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీఎస్పీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, మైనార్టీ కులాల అభ్యున్నతి బీఎస్పీతోనే సాధ్యమన్నారు. పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమల్ల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు పోలేపల్లి రాజేష్, బత్తుల ప్రసాద్, రేపాక నర్సింహ, ఏర్పుల నాగరాజు, వివిధ మండలాల అధ్యక్షులు కుకమూడి ముత్యాలు, కొమ్ము రమేష్, జిల్లా మధు, ఆంగోతు శివనాయక్, గ్రామ అధ్యక్షులు ఎలిమినేటి వెంకన్న, ఆంజనేయులు, అంజి తదితరులు ఉన్నారు.

'టీఎస్‌పీఎస్సీ'కి వ్యతిరేకంగా నిరసన

దేవరకొండ: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)ని ప్రక్షాళన చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ బుధవారం దేవరకొండలో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, వైఎస్సార్ టీపీ, వివిధ గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీ బోర్డు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలపై తక్షణమే సమగ్ర విచారణ చేసి పేపర్ లీకేజీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అదేవిధంగా టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ సిరాజ్, వంగూరి వెంకటేశ్వర్లు, నూనె సురేష్, రాజునాయక్, వనమల ఆంజనేయులు, పానుగంటి శ్రీకాంత్, బుడిగ వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం



దేవరకొండ: బాలికల జూనియర్ కళాశాల వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



మిర్యాలగూడలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చెన్నయ్య

దేవరకొండ: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అధికారులు దేవరకొండ పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 374 మంది విద్యార్థులకు గాను 343 మంది బుధవారం మొదటి సంవత్సరం తెలుగు పేపర్‌కు హాజరయ్యారు. బాలికల జూనియర్ కళాశాలలో 367 మంది విద్యార్థులకు గాను 334 మంది, మోడల్ స్కూల్‌లో 392 మంది విద్యార్థులకు గాను 375 మంది, ఎస్టీ గురుకుల కళాశాలలో 260 మంది విద్యార్థులకు గాను 246 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు తెలిపారు.

డిండి మండలంలో..

డిండి: మండల కేంద్రంలోని దొంతినేని నరసింహరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షకు 461 మందికి గాను 433 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ తాడిశెట్టి నరసింహ తెలిపారు.

నాగార్జునసాగర్‌లో..

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్షకు 507మందికి గాను 485మంది హాజరైనట్లుగా పరీక్షల అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షల కోసం అధికారులు రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎస్సీ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 354 మంది విద్యార్థులకు గాను 322 మంది, శ్రీక్రాంతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 215 మందికి గాను 211 మంది హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పేర్కొన్నారు.



దామరచర్లలోని గిరిజన గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

పరీక్షా కేంద్రాల పరిశీలన..

మిర్యాలగూడ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీగౌతమి, వాగ్దేవి, సినాప్స్ జూనియర్ కళాశాలలతో పాటు టీఎస్ గురుకుల జూనియర్ కళాశాల, కేఎల్ఎన్ బాలికల, బాలుర జూనియర్ కళాశాల్లో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆర్డీఓ చెన్నయ్య, డీఎస్పీ వెంకటగిరి పరిశీలించారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ స్క్వాడ్ అధికారులు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

దామరచర్ల మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఐ సత్యనారాయణ, తహసీల్దార్ గణేష్, ఎస్ఐ రవికుమార్, ఆర్ఐ సతీష్ తదితరులు ఉన్నారు.